నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 22 జూలై 2024 | NALGONDA

## జిల్లాలో చిరు జల్లులు



సూర్యాపేట, జూలై 21 (నమస్తే తెలంగాణ) : తుఫాన్ కారణంగా రెండు రోజులుగా జిల్లాలో చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తున్నది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో అత్యధికంగా 13.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మోతె మండలంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుమలగిరి మండలంలో 11.5, సూర్యాపేట, చింతలపాలెంలలో 10, నాగారం 9.5, జాజిరెడ్డిగూడెం 9, చివ్వెంల, నూతనకల్ 8.5, మునగాల 8, చిలుకూరు, ఆత్మకూర్.ఎస్ 7.3, నడిగూడెం, తుంగతుర్తిల్లో 7, పెన్‌పహాడ్ 6.7, పాలకవీడు 6.3, నేరేడుచర్ల 5.9, కోదాడ, హుజూర్‌నగర్ 5.8 మఠంపల్లి, అనంతగిరి, గరిడేపల్లి 5.7, మేళ్లచెర్వు 5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 7.5 మిల్లీమీటర్లు నమోదైంది.

# ఆరుతడి పంటలకు ఊతం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ముసురు
- పచ్చబడిన పత్తి, వేరుశనగ, కంది, పెసర పంటలు
- వరినాట్లకు సిద్ధమవుతున్న రైతులు

సూర్యాపేట, జూలై 21 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షానికి ఎండుముఖం పట్టిన పత్తి, వేరుశనగ, కంది తదితర ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది. వరి వేసే రైతులకు ఊరట కలిగించింది. వర్షాభావ పరిస్థితులతో ఇన్నాళ్లు నదుల్లో నీళ్లు లేకపోవడం, బోర్లు, బావులు అడుగంటి పోవడంతో వానల కోసం ఎదురు చూస్తున్న రైతాంగానికి ఈ వర్షం మేలు చేసేలా ఉన్నది. ఇప్పటికే వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వానకాలంలో భారీ వర్షాలు లేకపోవడంతో సీజన్ ప్రారంభమై నెల దాటినా జిల్లాలో దాదాపు 80 శాతం చెరువులు, కుంటలు నీళ్లు లేక ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కూడా ఓ మోస్తరు తప్ప భారీగా లేదు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే వరి పంటలు పండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత వర్షాలతో సూర్యాపేట జిల్లాలో 82,653 ఆరుతడి పంటలకు ఊతం వచ్చినట్లయ్యింది.



మేళ్లచెర్వులో కళకళలాడుతున్న పత్తిచేను



నల్లగొండ మండలం చందనపల్లిలో నాట్లు వేస్తున్న కూలీలు

### జూన్‌లో కురవాల్సినవి జూలైలో..

దాదాపు ఏడేండ్ల తర్వాత రైతన్నలకు కష్టం దాపురించింది. వర్షాలు లేకపోవడంతో జిల్లాకు ఇరు పక్కల గోదావరి, కృష్ణా జలాలు రాకపోవడంతో ఈ ఏడాది వ్యవసాయం సజావుగా సాగడం లేదు. జూన్ మాసంలో చిరుజల్లులు మాత్రమే కురువగా జూలైలో సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. దాంతో ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ రెండో వారం వరకు వేసిన ఆరుతడి పంటలు వేసవిని తలపించే రీతిన కొట్టిన ఎండలకు ఎండు ముఖం పట్టాయి. అనేక చోట్ల రైతులు ట్యాంకర్లతోపాటు దూర ప్రాంతాల నుంచి పైపులు వేసి తమ పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు.


జూన్‌లో కురువాల్సిన వర్షాలు జూలై సగం పూర్తయినా నామమాత్రంగానే పడుతున్నాయి. ఈ వానకాలంలో సూర్యాపేట జిల్లాలో 75,230 ఎకరాల్లో పత్తి, 955 ఎకరాల్లో కందులు, 2,140 ఎకరాల్లో పెసర, వేరుశనగతోపాటు తదితర ఆరుతడి పంటలు మొత్తం 82,653 ఎకరాల్లో వేయగా దాదాపు 80 శాతం పంటలు వర్షాలు లేక ఎండు ముఖం పట్టాయి. ఈ దశలో ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. జిల్లా పెద్ద ఎత్తున వరి సాగు చేయాల్సి ఉండగా కాల్వలో సాగు నీరు రాక, చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి పోయింది. దాంతో చాలా వరకు రైతులు వరినారు పోసి నాట్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దాదాపు 65శాతానికి పైనే నాట్లు పూర్తి కావాల్సి ఉండగా ప్రస్తుతం 10 శాతం కూడా నాట్లు పడలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

### రైతులు అధికారుల సూచనలు పాటించాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఆరు తడి పంటలకు ఊతం వస్తున్నది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు ఎరువులు, పురుగుల మందులు వాడాలి. ఈ వర్షాలు వరికి కూడా ఉపయోగపడతాయి. ఇక జిల్లా వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకోనున్నాయి.

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి



గురు పౌర్ణమి సందర్భంగా వట్టిమర్తిలోని సాయిబాబా గుడిలో పూజల్లో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, జూలై 21 : వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం చిట్యాల మండలంలోని వట్టిమర్తిలో గల సాయిబాబా దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. ఎలాంటి విపత్తులు రాకుండా అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించేలా చూడాలని సాయిబాబాను వేడుకున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తెరటుపల్లి హన్మంతు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఉత్సవ నిర్వాహకులు ఇమ్మడి వెంకటేశ్వర్లు, బోజ రాజు, రమణమూర్తి, వాణితోపాటు కాకులారపు బొర్రారెడ్డి, చంద్రకాంత్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



నరేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

## నరేశ్ మరణం కళారంగానికి తీరని లోటు

- ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

శాలిగౌరారం, జూలై 21 : తెలంగాణ సాంస్కృతిక సారథి, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వేముల నరేశ్ అకాల మరణం కళారంగానికి తీరని లోటని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. నరేశ్ స్వగ్రామమైన శాలిగౌరారం మండలంలోని ఊట్కూర్ గ్రామానికి వారు ఆదివారం చేరుకున్నారు. నరేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నరేశ్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ఆయన ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరి పేరు మీద రూ.50వేల చొప్పున రూ.లక్షా యాభై వేలను డిపాజిట్ చేస్తానని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, వేముల అశోక్, మహేశ్వరం వెంకన్న, చింతల శంకర్, అనంతుల సత్యనారాయణ, నోముల శ్రీను, తీగల వెంకన్న, వేముల మనోజ్ ఉన్నారు.

## భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు గణిత బోధన తప్పని సరికాదు

- మధ్యంతర ఉత్తర్వులు విడుదల చేసిన హైకోర్టు

రామగిరి, జూలై 21: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఫిజికల్ సైన్స్(భౌతికశాస్త్ర) ఉపాధ్యాయులు 6, 7 తరగతుల గణితం బోధించాలనే నిబంధన తప్పని సరికాదని పేర్కొంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు 6,7 తరగతులకు గణితం బోధించాలని ఏప్రిల్ 3, 2024న రాష్ట్ర విద్యాశాఖ జీఓ నంబర్ 11143/Prog.II /A1/2023 జారీ చేసింది.

అయితే తామంతా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పోస్టులో ఎంపికయ్యామని, తమకు సంబంధం లేని గణితం ఎలా బోధించాలని ప్రభుత్వ జీఓను సవాల్ చేస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 19 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు జూన్ 28, 2024న న్యాయవాది ఎం.రాంగోపాల్‌రావుతో కలిపి రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై స్పందించిన హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్ ఈ నెల 16న 16,731/2024 తీర్పును వెల్లడించి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు ఫిర్యాదుదారులు ఆదివారం తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన హైకోర్టుకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## వచ్చే మార్చి నాటికి బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పూర్తి

- త్వరలో గోపలాయపల్లి గుట్టపైకి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకొస్తా
- రుద్రయాగంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వేణుగోపాలస్వామి ఆలయంలో రుద్రయాగంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 21 : వచ్చే మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు సాగు నీరు అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలోని వారిజాల వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సుదర్శన యాగ సహిత రుద్ర యాగంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 16 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగ పనులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి రూ. 2,200కోట్లు మంజూరు చేయించామని, నిధులకు ఇబ్బందులు లేకుండా గ్రీన్ ఛానల్‌లో నిధులు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతు రుణ మాఫీ కింద రైతుల ఖాతాల్లో రూ. 6 వేల కోట్లు తమ ప్రభుత్వం జమ చేస్తున్నదని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పారు. వారిజాల వేణుగోపాల స్వామి ఆలయానికి రూ. 2 కోట్లతో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలో వాటిని మంజూరు చేస్తామన్నారు. త్వరలో వేణుగోపాల స్వామి దేవాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి చండీయాగం నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్ విజయవాడ ఆరు లైన్ల జాతీయ రహదారికి వచ్చే నెలలో టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ శివరామిరెడ్డి, మండల నాయకులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్, బత్తుల ఊషయ్య, వడ్డె భూపాల్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు

## బుద్ధవనం అద్భుత పర్యాటక ప్రాంతం

- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

నందికొండ, జూలై 21 : బుద్ధవనం అద్భుత పర్యాటక ప్రాంతమని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. బుద్ధవనంలో ఆదివారం ధర్మ చక్ర ప్రవర్తన దినోత్సవాన్ని నిర్వహించగా ఆయనతోపాటు నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, భూటాన్ మాజీ విద్యాశాఖ మంత్రి ఆచార్య ఠాకూర్ సింగ్ పొడ్యేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధచరిత వనంలో బుద్ధుడి పాదాలకు, మాహా స్థూపంలోని అచార్య నాగార్జునుడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మహాస్థూప మందిరంలో ధ్యానం చేశారు. ఈసందర్భంగా పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు సంవత్సరాలు కఠోర సాధన తర్వాత సిద్ధార్థుడు బుద్ధుడై తాను అనుభవ పూర్వకంగా తెలుకున్న నాలుగు సత్యాలను, ఆర్య అష్టాంగ మార్గాన్ని, మధ్యేమార్గం, ప్రతీత్య సముత్పాదమనే ధర్మచక్ర ప్రవర్తన సూత్రాన్ని ఆషాడ పూర్ణిమ నాడు తన శిష్యులకు బోధించాడని, ఆ రోజును ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. 273 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని బుద్ధుడి పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా నందికొండలోని బుద్ధవనం రానున్న రోజుల్లో విరాజిల్లుతుందన్నారు. అనంతరం బుద్ధవనం విశేషాలను తెలియపరిచే పోస్టర్లును విడుదల చేసి, ముఖ్య అతిథులకు జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్ రెడ్డి, బుద్ధవనం నిపుణులు ఈమని శివనాగిరెడ్డి, బుద్ధవనం సహాయక శిల్పి శ్యామ్‌సుందర్, ఏఈ నజీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు అడుగులు పెరిగిన సాగర్ నీటి మట్టం

- ప్రస్తుతం 505 అడుగులు



505 అడుగుల వద్ద నాగార్జునసాగర్ డ్యామ్ నీటి మట్టం

నందికొండ, జూలై 21 : నాగార్జునసాగర్ డ్యామ్ నీటి మట్ట రెండు అడుగుల మేర పెరిగింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకుగానూ ఈ ఏడాది జూలైలో 503 అడుగుల దిగువకు చేరింది. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతుండండంతో జల విద్యుత్ కేంద్రాల ద్వారా నీటిని దిగువకు వదులుతుండడంతో సాగర్ నీటి మట్టం 505 అడుగులకు చేరి రెండు అడుగులకు పెరిగింది. డ్యామ్ పూర్తి స్థాయి నీటి నిల్వ 312.05 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 122.52 టీఎంసీలు ఉన్నది. కుడికాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3,374 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి 9,874 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ 215.81 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 40.32 టీఎంసీలు ఉన్నది. శ్రీశైలానికి 96,107 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. కృష్ణా ప్రాంతంలో ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల నుంచి దిగువన ఉన్న శ్రీశైలానికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో నాగార్జుసాగర్ రిజర్వాయర్ ఈ ఏడాది పూర్తి స్థాయిలో నిండే అవకాశం కనిపిస్తున్నది.

# యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ ప్రారంభమయ్యేనా?

- అనుమతి నిరాకరించిన నేషనల్ మెడికల్ కమిషన్
- ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ పూర్తి కాకపోవడంతోనే..
- తాజాగా అనుమతిపై అప్పీలుకు వెళ్లిన అధికారులు
- పట్టించుకోని ప్రభుత్వ విప్ బీర్ల.. రాజకీయాలకే పరిమితం..?

### ఈ విద్యా సంవత్సరం ఏర్పాటుపై సందిగ్ధం

**యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందా..? వచ్చే కౌన్సెలింగ్‌లో జాబితాలో మన కాలేజీ ఉంటుందా..? అనేది స్పష్టత రావడం లేదు. ఈ ఏడాది కాలేజీ ప్రారంభంపై సందిగ్ధత నెలకొంది. మెడికల్ కాలేజీకి అనుమతి రాకపోవడంతో ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారులు మాత్రం అప్పీలుకు వెళ్లినట్లు చెబుతున్నారు. ఇక ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాత్రం కాలేజీ అంశాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.** – యాదాద్రి భువనగిరి, జూలై 21 (నమస్తే తెలంగాణ)



భువనగిరిలో తాత్కాలికంగా మెడికల్ కళాశాలకు కేటాయించిన భవనం

గత బీఆర్‌ఎస్ సర్కారు తెలంగాణ వ్యాప్తంగా పెద్దఎత్తున మెడికల్ కాలేజీలను నెలకొల్పింది. ఇందులో భాగంగా యాదగిరి గుట్టకు గతేడాది జూన్ 5న అప్పటి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభం అవుతాయని జీఓలో పేర్కొన్నారు. ఇక కాలేజీ నిర్మాణానికి రూ.183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతుల కోసం సెప్టెంబర్ 16న జీఓ నంబర్ 162 విడుదల చేశారు. అదే రోజు 433 పోస్టులను క్రియేట్ చేస్తూ జీఓ నంబర్ 124 రిలీజ్ చేశారు. ఇందులో అనుబంధ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహ స్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టి పెట్టకపోవడంతో వంద నుంచి 50 ఎంబీబీఎస్ సీట్లకు కుదించారు. పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కాలేజీ ప్రారంభానికి ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. అందుకు అనుగుణంగా మరమ్మతులు కూడా చేయించారు.

### పట్టించుకోని ప్రభుత్వ విప్ బీర్ల..!

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మెడికల్ కాలేజీ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలేజీ యాదగిరిగుట్టకు మంజూరైంది. అక్కడే ఏర్పాటుకు అన్ని అనుమతులు కూడా ఉన్నాయి. తాత్కాలికంగా గుట్టలోనే ఏర్పాటు చేయకుండా.. భువనగిరిలోని పాత కలెక్టరేట్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గుట్టకు మంజూరైతే భువనగిరిలో ఎలా ఏర్పాటు చేస్తారనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. గుట్టలో పాలిటెక్నిక్ కాలేజీకి సంబంధించి రెండు బిల్డింగ్‌లు కూడా ఖాళీగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పుడు దానిని పట్టించుకోలేదని, ఇప్పుడు ఎన్ఎంసీ అనుమతి నిరాకరించిన దానిపై కూడా ఫోకస్ పెట్టడలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం రాజకీయాలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.


### అనుమతి నిరాకరణ..

తెలంగాణలో 8 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి నిరాకరించింది. అవసరమైన నిబంధనలు పాటించలేదని, వసతులు లేవని పర్మిషన్ ఇవ్వలేదు. ఇందులో యాదాద్రి మెడికల్ కాలేజీ కూడా ఉన్నది. నిబంధనల ప్రకారం 50 ఎంబీబీఎస్ సీట్లతో కాలేజీ ఏర్పాటు కావాలంటే 14మంది ప్రొఫెసర్లు, 20మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. సుమారు 60మంది టీచింగ్ స్టాఫ్ ఉండాలి. అయితే ఈ మెడికల్ కాలేజీలో ఈ నిబంధనలు పాటించలేదు. ఎన్ఎంసీ టీమ్ తనిఖీలకు వచ్చినప్పుడు సరైన సదుపాయాలు, స్టాఫ్ లేనట్లు గుర్తించారు. దీంతో కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదు.

### అప్పీలుకు అధికారులు

ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను 60 రోజుల్లో సవరించుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీ అనుమతి కోసం అధికారులు అప్పీలుకు వెళ్లారు. కళాశాల అనుమతిని పునఃపరిశీలించాలని ఎన్ఎంసీని కోరారు. గతంలో ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ పూర్తి కాలేదని, ప్రస్తుతం ఈ సమస్య సమసిపోయిందని అధికారులు చెబుతున్నారు. ఈ సారి అనుమతి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఎన్ఎంసీ అనుమతి ఇస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

### ప్రభుత్వ చేతగాని తనం వల్లే..



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరి గుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేయించాం. అప్పట్లోనే అన్ని అనుమతులు మంజూరయ్యాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కావాలి. కానీ కనీసం ప్రారంభానికి ఏర్పాట్లు కూడా చేయకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం చేతగాని తనం వల్లే అనుమతి నిరాకణ జరిగింది. కేసీఆర్ అభివృద్ధి ఆనవాళ్లు తుడిచేసే కుట్ర జరుగుతున్నది. రాజకీయాలకు ఇచ్చే ప్రాధాన్యత పాలనకు ఇవ్వడం లేదు.

– గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆలేరు